క్లుప్తంగా

తుదిదశలో అమ్మవారి రంగుల ఉత్సవం

ఈనెల 18న పెనుగంచిప్రోలుకు పయనం



జగ్గయ్యపేట: పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసియున్న గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారుతో పాటు సహదేవతల విగ్రహాలకు రంగులు దిద్దే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఈనెల ఒకటో తేదీన అమ్మవారితోపాటు సహదేవతల విగ్రహాలు రంగుల మహోత్సవానికి జగ్గయ్యపేటకు తీసుకువచ్చారు. పట్టణంలోని దస్తావేజుల సెంటరులోని మంటపంలో ఆచారం ప్రకారం గాజర్ల వంశీయులు రంగులు దిద్దుతున్నారు. మూలవిరాట్ తిరుపతమ్మ, గోపయ్య విగ్రహాలతో పాటు ఉత్సవ విగ్రహాలు తిరుపతమ్మ, గోపయ్యలతోపాటు మల్లయ్య, చంద్రమ్మ, మద్దిరావమ్మ, వినుకొండ అంకమ్మ, ఉన్నవూరు అంకమ్మ విగ్రహాలకు రంగులు దిద్దటం పూర్తయింది. పెద్దమ్మవారు, గుర్రం విగ్రహాలకు రంగులు దిద్దడం గురువారంతో పూర్తవుతుందని వంశీయులు భాస్కరరావు తెలిపారు. రంగులు పూర్తిచేసుకుని అమ్మవారితో పాటు సహదేవతల విగ్రహాలు ఈనెల 18న జగ్గయ్యపేట నుంచి పెనుగంచిప్రోలుకు పల్లకిలో వెళ్లనున్నాయి. మరో మూడురోజుల్లో అమ్మవారు పయనం ఉండటంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు.

సామూహిక అక్షరాభ్యాసాలు



నందిగామ: పట్టణ శివారు పల్లగిరి గుట్టపైగల త్రిశక్తి పీఠంలో శ్రీపంచమి పర్వదినం నేపథ్యంలో బుధవారం విశేషపూజలతోపాటు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ముందుగా ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞానసరస్వతి అమ్మవార్లకు వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక కుంకుమపూజలు, అక్షరాభ్యాసాలు చేశారు. ఆలయ అర్చకుడు రాజేష్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష



నందిగామ: భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ సరస్వతి సూచించారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఈనెల 19 నుంచి పది రోజులపాటు జరగనున్నాయి. ఈనేపథ్యంలో కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై పోలీసు, ఫైర్, విద్యుత్‌శాఖల అధికారులతో తహసీల్దార్ సరస్వతి బుధవారం తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామివారి కళ్యాణం, రథోత్సవ సమయాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్యంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉత్సవాలు పూర్తయ్యేంత వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. భక్తులకు తాగునీటి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వసంత పంచమి వేడుకలు



వత్సవాయి : వసంత పంచమి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి పూజలు చేశారు. మక్కపేటలోని శ్రీసాయి సెంచరీ హైస్కూల్‌లో తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ సవిత దంపతులు సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు.

అభివృద్ధిపథంలో తోటచర్ల

తోటచర్ల(పెనుగంచిప్రోలు): మండలంలోని తోటచర్ల గ్రామం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. మండల పరిధిలోని జాతీయ రహదారి పక్కనున్న తోటచర్ల గ్రామంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో మునుపెన్నడూ లేనివిధంగా మౌలికవసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులను కేటాయించారు. దీంతో గ్రామంలో మౌలికవసతులు మెరుగుపడ్డాయంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

రూ.46లక్షలతో పాఠశాల అభివృద్ధి..

నాడు-నేడు పథకం కింద తోటచర్లలోని ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.46లక్షలు మంజూరయ్యాయి. ఈనిధులతో పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణంతో పాటు విద్యార్థులకు బల్లలు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు మెరుగుపరిచారు.

రూ.40లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలు..

గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. రూ.20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టారు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.6లక్షలతో ఎస్సీకాలనీలో పైపులైన్ ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పక్కన అత్యంత విలువైన భూమిని జగనన్న కాలనీగా ఏర్పాటు చేసి 143 మందికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. లబ్ధిదారుల్లో 100 మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకున్నారు.



తోటచర్లలో కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా ఉన్న ప్రభుత్వ యూపీ పాఠశాల

ఇది కదా.. అభివృద్ధి

రూ.36.50లక్షలతో సొసైటీ భవనం..

గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం శిథిలావస్థకు చేరుకోవడంతో జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో రూ.36.50లక్షలతో సొసైటీకి నూతన భవనం నిర్మించారు. భవనంలో రైతులకు అన్నిరకాల వసతులు కల్పించారు.

రూ.70లక్షలతో గోడౌన్..

మండలంలో ఎక్కడాలేని విధంగా గ్రామంలోని రైతులు తమ ధాన్యం నిల్వ చేసుకునేందుకు, ఆరబెట్టుకునేందుకు వీలుగా రూ.70 లక్షలతో సొసైటీ తరుపున ఎంపీఎఫ్‌సీ గోడౌన్ నిర్మాణం చేపట్టారు. సుమారు 1000 మెట్రిక్ టన్నులు నిల్వచేసే సామర్థ్యంగల ఈ గోడౌన్ పనులు త్వరలో పూర్తికానున్నాయి.

సచివాలయానికి శంకుస్థాపన..

తోటచర్లలో గ్రామసచివాలయ నిర్మాణానికి రూ.43.60 లక్షలు మంజూరుకాగా, భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామస్తుల తాగునీటి అవసరాల కోసం ఓవర్‌హెడ్ ట్యాంక్‌తో పాటు పైపులైన్ విస్తరణ, ఇంటింటికి కుళాయి ఏర్పాటు కోసం జలజీవన్ మిషన్ నిధులు రూ.32లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. ఇలా కోట్లాది రూపాయల నిధులను కేటాయించడం ద్వారా గ్రామంలో వసతులు మెరుగుపరచడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే సామినేని ఉదయభానులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



నూతన సొసైటీ భవనం



నిర్మాణంలో ఉన్న గోడౌన్



జగనన్న కాలనీలోని ఇళ్లు

ఊహించని అభివృద్ధి..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో గ్రామంలో కోట్లాది రూపాయిల నిధులతో అభివృద్ధి పనులు పూర్తిచేయడం సంతోషంగా ఉంది. ఇంత పెద్దఎత్తున నిధులు మంజూరు చేసినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుకు రుణపడి ఉంటాం.

– కునగుంట్ల రాములమ్మ, సర్పంచి

రైతుల కోసం గోడౌన్..



సొసైటీ పాతభవనం శిథిలం కావడంతో ఎమ్మెల్యే ఉదయభాను దృష్టికి తీసుకెళ్లగా నూతన భవనం కోసం రూ.36.50 లక్షలు మంజూరు చేయించారు. రైతుల కోసం రూ.70లక్షలతో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన గోడౌన్ నిర్మాణం కూడా త్వరలోనే పూర్తవుతుంది.

– కుంటముక్కల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు

తాగునీటి సమస్యకు పరిష్కారం..



తాగునీటి సమస్య తక్షణ పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఉదయభాను సూచనల మేరకు చర్యలు చేపట్టాం. బోర్లు వేయాల్సిన ప్రాంతాలను ఇప్పటికే గుర్తించాం. ఈవారంలో బోర్లు ఏర్పాటు చేస్తున్నాం. అనంతరం మినీట్యాంక్‌ల ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తాం.జలజీవన్ మిషన్ నిధులతో గ్రామంలో తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోతుంది.

– మార్కపూడి గాంధీ, పెనుగంచిప్రోలు ఎంపీపీ

ఘనంగా ఆలయ ప్రతిష్ట

- రూ.36లక్షలతో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): హిందూ ధర్మ పరిరక్షణతోపాటు ఆలయాల అభివృద్ధి, నిర్మాణాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం మునగాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి వారి ఆలయ ప్రతిష్టా కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలతోపాటు హోమాది క్రతువులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ స్వామివారి ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా గ్రామస్తులంతా ఐక్యంగా ఆలయాన్ని నిర్మించుకుని ఘనంగా ప్రతిష్టా కార్యక్రమం జరుపుకోవడం అభినందనీయమని తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి దేవాదాయశాఖ ద్వారా సీజీఎఫ్ నిధులు రూ.36లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఆదాయంలేని ఆలయాలకు సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దూపదీప నైవేద్యాల కోసం ప్రతినెల ఆర్థిక తోడ్పాటునందిస్తోందని వివరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, గరికపాటి భాస్కరం, గంగూరి వెంకటేశ్వరరావు, నల్లాని అయ్యన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



హోమాది క్రతువులు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

క్రైస్తవుల తపోదీక్షలు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: క్రైస్తవుల జీవితంలో తపస్సు కాలం ఓ మజిలీ వంటిదని స్థానిక తిరుహృదయ ఆర్‌సీఎం చర్చి ఫాదర్ గుడిసె జయరాజు పేర్కొన్నారు. విభూది బుధవారం సందర్భంగా స్థానిక తిరుహృదయ ఆర్‌సీఎం చర్చిలో విజయవాడ లయోల కళాశాల డైరెక్టర్ ఫాదర్ బాల దివ్యబలి పూజ నిర్వహించారు. అనంతరం ఫాదర్ జయరాజు ప్రసంగిస్తూ 40రోజుల పాటు ప్రార్థనలు, ఉపవాసాలు, దానధర్మాలతో సాగే ఈ తపస్సు కాలం మనిషి పవిత్రత, పరిపూర్ణతకు దోహదపడుతుందని వివరించారు.

హృదయ పరివర్తనకై యేసుక్రీస్తు ఇచ్చిన పిలుపును స్వీకరించి తమ జీవితాలను పునఃపరిశీలన చేసుకుంటూ ప్రేమ, సేవ, క్షమాగుణాలను పెంపొందించుకునేందుకు ఉపయోగపడే పవిత్ర సమయమే ఈ తపస్సు కాలమని తెలిపారు. ఇది విభూది బుధవారంతో మొదలై గుడ్ ఫ్రైడే తో ముగుస్తుందన్నారు. సంఘస్తులకు గురువులు విభూదిని పంచిపెట్టగా, సుమారు 200మంది తపోదీక్ష స్వీకరించారు.

చర్చిలలో ప్రార్థనలు...

భస్మ బుధవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోస్టాఫీసు వద్ద ఉన్న సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చిలో డీనరీ చైర్మన్ సిలారపు పాల్‌రాజు దైవసందేశం ఇచ్చారు. చర్చి కమిటీ సభ్యులు, స్త్రీల మైత్రి, యూత్ సభ్యులు పాల్గొన్నారు. కోదాడ రోడ్డులోని బేతెస్థ చర్చి, బలుసుపాడు రోడ్డులోని బేతేలు చర్చి, క్రిస్టియన్‌పేట, విలియంపేటల్లోని సీఎస్ఐ, జీజీఎఫ్ మినిస్ట్రీస్ చర్చిలు, ఆటోనగర్ ఆమోద ఇండస్ట్రీస్‌లోని చర్చి, తొర్రగుంటపాలెంలోని సియోను చర్చి, ఆర్టీసీ కాలనీలోని హోసన్నా ప్రార్థనామందిరం, కాకాని నగర్‌లోని క్రైస్ట్ చర్చి, షాలేం చర్చిలలో ఆయా పాస్టర్లు, సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



పేటలోని ఆర్‌సీఎం వద్ద ఫాదర్లు జయరాజు, బాల ఆధ్వర్యంలో తపోదీక్ష స్వీకరిస్తున్న దీక్షాపరులు

ఆరోగ్యంపై అవగాహన అవసరం

కొణకంచి(పెనుగంచిప్రోలు): ప్రతిఒక్కరూ మంచి ఆహారం తీసుకుని రోగనిరోధక శక్తిని పెంచుకోవాలని స్థానిక ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి కె.వాణి సూచించారు. కొణకంచి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో మంచి పోషక విలువలు ఉన్న ఆహారం అందిస్తున్నారన్నారు. అలాగే ప్రతిఒక్కరు చుట్టూ ఉన్న ఆయుర్వేద మొక్కలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మంచి ఆరోగ్యంతోనే మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం ఇమ్యూనిటీ ఆయుర్వేద మందులను ఉచితంగా అందజేశారు. ఉపాధ్యాయులు పద్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వాణి

కల్యాణ పీటలపై కూర్చునే దంపతులు ఎంపిక

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని పీటలపై కూర్చునే దంపతులను బుధవారం ఆలయ ప్రాంగణంలో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఫిబ్రవరి 23న నిర్వహించే కల్యాణంలో శ్రీతిరుపతమ్మవారి తరుపున ఆమె ఇంటిపేరుగల కొల్లా వారి తరుపున కొల్లా రఘురామయ్య దంపతులు ఒక్కరే దరఖాస్తు చేసుకోగా వారు ఎంపికయ్యారు. అమ్మవారి భర్త శ్రీగోపయ్యస్వామి తరుపున కాకాని ఇంటిపేరు వారు ఏడుగురు దరఖాస్తు చేసుకోగా, లాటరీ ద్వారా కాకాని కృష్ణమూర్తి దంపతులు కల్యాణ పీటలపై కూర్చునేందుకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

ఈనెల 23న జరగనున్న అమ్మవారి వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని కల్యాణ వేదిక స్థలంలో చేపట్టే పనులకు బుధవారం భూమిపూజ చేశారు. అదేవిధంగా జగ్గయ్యపేట రంగులకు వెళ్లిన శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారితోపాటు సహదేవతలు తిరుగు ప్రయాణంలో పల్లకీల్లో వచ్చే లింగగూడెం, భీమవరం రోడ్డు మరమ్మతు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలను తొలగించడంతో పాటు డ్రోజర్‌తో శుభ్రం చేయిస్తున్నారు. భక్తులకు ఇబ్బందిలేకుండా తగు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె.రమేష్‌నాయుడు, పాలకవర్గ సభ్యులు బోశెట్టి విజయ లక్ష్మి, బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకట రమణ, ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు పాల్గొన్నారు.



కల్యాణ పీటలపై కూర్చొనే దంపతులను ఎంపిక చేస్తున్న చైర్మన్, ఈవో, పాలకవర్గసభ్యులు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చెరువుబజారులో వేంచేసియున్న శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పురాతనమైన ధ్వజస్తంభం జీర్ణావస్థకు చేరడంతో ఆస్థానంలో నూతన జీవ ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని సీతారామపురం కొత్త వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురువీధిలో ఈనెల 7వ తేదీ రాత్రి నడిరోడ్డుపై హత్యాయత్నానికి గురైన గిద్దా సత్యశ్రీ(36) విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు..వారంరోజులుగా విజయవాడలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యశ్రీ ఆరోగ్యం విషమించడంతో బుధవారం మృతిచెందినట్లు ఆయన వివరించారు. ఆమెపై హత్యాయత్నానికి పాల్పడిన ముద్దాయి సయ్యద్ జాన్‌సైదాను ఈనెల 13వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన విషయం విదితమే.

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



మాట్లాడుతున్న చైర్మన్ భరద్వాజ్

తిరుమలగిరి(జగ్గయ్యపేట):గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ తెలిపారు. ఆలయ ధర్మకర్త పాలక మండలి తొలి సమావేశం ఆయన అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ చుట్టూ గిరిప్రదక్షిణ కోసం పనులు పూర్తవుతున్నాయన్నారు. కోనేరు అభివృద్ధి, ఆర్చి గేటు నిర్మాణాలు, భక్తుల సౌకర్యార్థం లిఫ్టు, స్వామి వారి ప్రచారానికి దాతల సహకారంతో రథం ఏర్పాటు తదితర అభివృద్ధి పనులతోపాటు సిబ్బంది వేతనాల పెంపునకు తగిన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. ఏసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు, పాలకవర్గ సభ్యులు రాంబాబు, వెంకటేశ్వర్లు, నరసింహారావు, రమాదేవి, ప్రధానార్చకుడు రామ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పార్కు ఏర్పాటు అభినందనీయం



పెనుగంచిప్రోలు: స్థానిక చెరువు కట్ట వద్ద నిర్మాణంలో ఉన్న పార్కు పనులను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా విప్ ఉదయభాను మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రంతోపాటు 20వేలకు పైగా జనాభా ఉన్న పెనుగంచిప్రోలులో పార్కు లేకపోవడంతో సర్పంచి వేల్పుల పద్మకుమారి ప్రత్యేక పట్టుదలతో పార్క్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. అలాగే చెరువుకట్టపై పచ్చని లాన్ ఏర్పాటు చేయాలని సర్పంచికి సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, ఆలయ పాలకవర్గ సభ్యులు కాకాని అలేఖ్య, బెజవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహనచోదకులకు జరిమానా

కంచికచర్ల : వాహనాలు నడిపే సమయంలో వాహనచోదకులు తప్పకుండా రోడ్డు భద్రతా నియామాలు పాటించాలని, లేనిపక్షంలో జరిమానా విధిస్తామని ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. స్థానిక పెట్రోలు బంక్ సెంటర్, నెహ్రూబొమ్మ, అంబేద్కర్ సెంటర్, జుజ్జూరు రోడ్డు, గొట్టు ముక్కల రోడ్డు సెంటర్లలో బుధవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువీకరణపత్రాలులేని 20వాహనాలను గుర్తించి వాహనచోదకులకు రూ.2,500 జరిమానా విధించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.

కరపత్రాల పంపిణీ

వత్సవాయి : ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని మండల సీఐటీయూ కార్యదర్శి బి.రాము కోరారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులు బుధవారం వత్సవాయిలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, కార్పొరేట్ సంస్థలకు అనుకూల వైఖరి, మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం గడచిన పదేళ్లుగా కార్మిక, రైతాంగ సమస్యలను పరిష్కరించలేదన్నారు. 16న చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు దేవయ్య, స్వామి, నాయుడు, మోహన్ రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వీరులపాడు: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మండల తహసీల్దార్ రాజకిషోర్ సూచించారు. మండలంలోని జుజ్జూరు, పెద్దాపురం, అల్లూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, వెలుతురుతోపాటు అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎన్నికలలో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌లో నిర్మాణం చేపట్టిన షాదీఖానాను టీడీపీ నానాయకులు కొందరిచేత కోర్టులో కేసులు వేయించి నిలుపుదల చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలోని ముస్లిం సోదరులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారంతో ఐదోరోజుకు చేరుకున్నాయి. జామియా మసీదు ప్రెసిడెంట్ షేక్ జలీల్ ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు దీక్ష చేశారు. షాదీఖానా నిర్మాణాన్ని టీడీపీ నాయకులు అడ్డుకోవడం తగదని, వెంటనే పనులు ప్రారంభించేలా సహకరించాలని కోరారు.